ఈ క్షణంలో మిమ్మల్ని అరెస్టు చేయించ గలను! తలుపు తెరిచి చూడండి. బయట పోలీస్ ఇన్‌స్పెక్టర్ వున్నాడు—అంతా గమ నిస్తూ! కాని పశువుల పట్ల కూడా మానవత్వం ప్రదర్శించడం నా తత్వం. మిమ్మల్ని అరెస్టు చేయించను లెండి. ఇక నోరు మూసుకొని నేను చెప్పేది వినండి...." అపర చండికలా గర్జించిం దామె.

నోరు తెరచి ఊరుకున్నాడు రామ్మూర్తి, బోనులో సింహంలా! అతని అవస్థ చూచి కామాక్షమ్మ నోరు నొక్కుకుంటే వెంటనే వదినకు థాంక్స్ చెప్పా లనిపించింది సుమిత్రకు!

కోపాన్ని అదుపులో పెట్టుకొని, సాధ్యమై నంత సౌమ్యంగా "మాది గుళ్ళో పెళ్ళి అయితే, మాంగల్యాన్ని తెంపివేసి—నీ వెవరో నాకు తెలియదు. పో—అనగల సమ ర్థులే మీరు! కాని మాది రిజిస్టర్ పెళ్ళి! 'వది లేసాడు'—అన్నంత తేలికగా ఈ బంధం పోదు. అర్ధరూపాయి మోసాన్నే సహించని నేను—నా జీవితాన్నే దోపిడీ చేసిన వ్యక్తిని తేలికగా వదిలిపెడతానని ఎలా అనుకున్నారో ఆయన! నేను కూర్చుంటేనే మీ కుర్చీ మైల పడినట్టు ఆర్భాటం చేస్తున్నారే! మీ అబ్బాయి నా కులంవల్ల సంపాదించుకున్న ఉద్యోగం మైలపడిపోలేదా? ఆ ఉద్యోగం యిచ్చే జీతం అంటరానిది కాదా? జీతంమీద యిన్ని పసుపు నీళ్ళు చల్లి శుద్ధిచేసి వాడుకుంటున్నారు కాబోలు! నా మీద కూడా అట్లానే పసుపునీళ్ళు చల్లి నన్ను మీలో చేర్చుకోరేం? మాలో మలినం లేదు రామ్మూర్తిగారూ! మీ మనసులోనే వుంది మలినం అంతా! ముందు మీ బుద్ధిని శుద్ధి చేసు కోండి...."

ఆగి కాసేపు సుమిత్రమీద దృష్టి నిలి పింది పద్మ. కళ్లతోనే నవ్వి థాంక్స్ చెప్పింది సుమిత్ర.

దృష్టి మరల్చుకొని "పొమ్మంటే, చూరు పట్టుకొని వేలాడేదాన్ని కాను! విన్ననే ఆయన అలా చెప్పి వున్నట్టయితే యిప్పుడు మీ యింటికి వచ్చేదాన్నే కాను. అలా చెప్పడానికి ఆయనకి ధైర్యం చాలలేదు. ఇప్పుడుకూడా ఇంట్లో లేకుండా పారిపోయారు. సరే. ఆయన వచ్చాక ఒక విషయం చెప్పండి. వదిలేసాను—అని నోటి మాటగా అంటే కుదరదు. కోర్టుద్వారా విడాకులు యివ్వాలి. ఆయన అందుకు సుముఖంగా లేకపోతే—మోసం చేసారని నేనే కోర్టుకెక్కి విడాకులు పొందుతా. విడిపోయాక నేను చేయబోయే పని కూడా చెబుతున్నా. ఖాయమైంది కాబట్టి తన ఉద్యోగం ఎవరూ పీకేయలేరు—అని ఆయనా, మీరూ అనుకుంటున్నారు కాబోలు. నా కులంతో వచ్చిన ఉద్యోగం నా కులంతోనే పోవాలి. అది న్యాయం. ఆ న్యాయం సాధించడానికి నే నెంత దూరం అయినా వెళ్తా. ఆ విషయం గుర్తుం చుకోమని ఆయనతో చెప్పండి. ఆకలి కడుపు లతో—కులాలన్నీ ఒకటే అని ఆదర్శాలు వల్లించి, ఆకలి తీరగానే—మీరు వేరు; అసింటా....అసింటా....—అనే కుంతలకూ, తలిదండ్రులకు భయపడి భార్యల్ని వదిలేసే పిరికిపందలకూ, కుహనా సంస్కారులకూ తగిన పాఠం నేర్పుతా.... ఈ ప్రయత్నంలో నేను నాశనం అయినా సరే.... ఊబిలో దిగబడి పోకుండా వేలాది నా సోదరీమణులను రక్షిస్తా...." సర్వ మాలిన్యాలనూ శుద్ధిచేసే అగ్నిశిఖలా జ్వలిస్తూ—తలుపులు తెరచుకొని ధీర లలితంగా ముందడుగు వేసింది పద్మ.

రామ్మూర్తి పంతులు యింకా చేతులు విదుపుకుంటూనే వున్నాడు!



# తూరుపుదారి



కొసరాపు సంజీవ్

ఠంగ్! ఠంగ్! ఠంగ్!!

ఎక్కడో మూడు గంటలు కొట్టిన శబ్దం.

వరండాలోంచి వస్తోన్న లైట్ వెలుగు సన్నగా ప్రసరిస్తోంది, సెల్‌లోకి.

టక్! టక్! టక్! టక్!

సెంట్రీ బూట్ల చప్పుడు, ఆగి ఆగి లయ బద్ధంగా.

ఆ గదిముందే ఆగాడు సెంట్రీ. గదిలోకి చూశాడు.

చువ్వల వెనుక....

గోడ నానుకొని కూర్చున్నాడతను, వేమన భంగిమలో.

"ఏమిటి రాంబాబూ! ఇంకా నిద్రపోలేదా!!" జాలిగా అంటున్నాడు సెంట్రీ అతడ్నే నిశితంగా

చూస్తూ.

మౌనం! మందహాసం!! (అది సమాధానం) ముందుకు సాగిపోయాడు సెంట్రీ ఏదో గొణుగుతూ.

లేచి నిలబడ్డా డతను, నిదరలో అలసిన మృగరాజు మేల్కొని చురుకుగా జూలు విదిల్చి నట్టు.

చువ్వల్ని పట్టుకొని బైటకు చూశాడు.

దూరంగా సాగిన అతడి దృష్టిలో....

నిర్మలంగా ఆకాశం నల్లపైట కప్పుకున్న పుని స్త్రీలా!!

నిశిధంలో నక్షత్రాలు ఆమె సిగలో పెట్టిన మల్లెపూల్లా!!!

హుఁ! (భారంగా ఒక నిట్టూర్పు.)

రేపటినుంచి

ఈ ఆకాశం తనకి కనిపించదు!

ఈ చుక్కల సంగీతం వినిపించదు!!

ఈ చువ్వల చప్పుడు ధ్వనియించదు!!!

అవును.

తను రేపు ఈ జైలు గదిలోంచి బైటకు వెళ్తాడు.

తన్ను రేపు ఈ ఖైదునుంచి శాశ్వతంగా విడుదల చేస్తారు.

వి—డు—ద—ల (ఖని)+(ఒక నిర్వికార నవ్వు.)

....రేపు!

ప్రభాత సమయం!

ఉషస్సు తొంగిచూసే వేళ!

ఉరికంబం ముందు తాను....

ఉరిత్రాడులో బిగిసిన తాను....

పైకి—క్రిందకీ— చేదబడీ—లాగబడీ—గుంజబడీ—

ఊపిరి అరుదై

శ్వాస కరువై....తర్వాత క్షణంలో

తను ఛస్తాడు.

తాను మరణిస్తాడు.

(తననిఉరి తీసినట్టు పత్రికల్లో వస్తుందా? ఏమో?)

తెల్లని మల్లెపూవులా

కదిలే పావురంలా

వచ్చినవాడు క్రైస్తవ ఫాదర్!

భూలోకంలో దేవుని ఏజంట్!!

రాంబాబు అతడి వంక చూశాడు, తీక్షణంగా, అసహ్యంగా.

"............" ఏదో చెబ్తూనే ఉన్నాడు ఫాదర్.

బోర్! బోర్!! బోర్బోర్!!!

చూపుడు వ్రేలుతో దారి చూపిస్తూ

"గెటవుట్!

నాకు ఏ దేవుడి గోలా వద్దు. ఊఁ! నీవు త్వరగా వెళ్తేనే నా ఆత్మ శాంతిస్తుంది. అయ్ సె గెట్టవుట్!"—రాంబాబు గొంతులో కాఠిన్యం.

పాపం!

తెల్లపావురం తెల్లబోయింది.

బయటకు వెళ్ళబోయింది.

మళ్ళీ, "బిడ్డా! చావు ఎప్పుడో తెలుసు నీకు: అందుకే బ్రతుకుపై మమకారం చావక క్షోభిస్తున్నావు. నీ కెలాగూ చావు తప్పదు గనక ఆ దేవదేవుడిని మన ప్రభువుని స్మరించుకో. నీకు 'శాంతి' లభి...."

రాంబాబు పళ్ళు పటపట మన్న చప్పుడు, స్పష్టంగా, గట్టిగా.

ఫాదర్ హడలిపోయాడు.

హడావిడీగ వెడలిపోయాడు....

రాంబాబు తృప్తిగ నవ్వుకున్నాడు.

('శాంతిని' పారద్రోలినందుకు)

అతడి నిళ్ళలో క్షణమాత్రపు సంతృప్తి.

కాని

ఆ కళ్ళ రెప్పల క్రింద....

గత స్మృతుల వేదన!

మరపురాని జ్ఞాపకాల రోదన


అసంకల్పితంగా అతడి మనసు గతాన్ని చూస్తోంది.

(గతం అతడి ముందు నిలిచి పరిహాసం చేస్తున్నట్టు క ణ త లు రుద్దుకుంటున్నాడు, బాధగా....)

§ § § § § §








"దొరా!"

జీరవోయిన కంఠాన్ని పెగుల్చుకొని భయం భయంగా. అతడు పాలేరు వెంకన్న. ఎంకటిగాడు.

(ఫాదర్ ఆఫ్ రాంబాబు)

విలాసంగా చుట్ట (సిగార్) పీలుస్తున్నాడు దొరగారు, కులాసాగ పేపర్ తిరగేస్తూ. పాలేరు పిలుపు విని కాస్త ఓరగా చూశాడు. ఎముకలు కూర్చిన శరీరాన్ని, అవతారాన్ని చూడలేక, తల త్రిప్పి పేపర్ వైపు దృష్టి సారించాడు.

ఎంకన్న గొంతు తడారినట్లయ్యింది. క్షణ కాలం ఎటూ పాలుపోలేదు. ఎలాగో వాల్యూం పెంచి మళ్ళీ పిల్చాడు—"దొరా!"

దొర ఇటు చూడకుండానే "ఊఁ!" అన్నాడు దర్పంగా. (అమ్మయ్య! దొర వింటు న్నాడని తెలిసింది, ఎంకన్నకి.)

మొదలెట్టాడు.

"నీ బాంచెన్ దొర! కాల్మొక్త!! మా రాఁవులుగాడు, అదే నా కొడుకుండ్రి! మీ దయవలన (?) పదోకళాసు (పదవ తరగతి) కామ్యాఁప్ (పాస్) అయినాడుండ్రి—" తర్వాత ఎలా చెప్పాలో తోచక ఆగాడు.

"అచ్ఛా" కొంచం చిత్రంగా అన్నాడు దొర.

"మరి....మరండ్రి....నో పాల పంతుల్లు (స్కూల్ టీచర్స్) 'మీ రాఁవులుగాడు భగ (చాలా) తెల్విగల్లోడు, ఎట్లగయినా అన్ని పెద్ద సదువుల పెట్టాలె' అని చెపుతున్నారుండ్రి! మా కులపోల్లకి సదువుకుండ్క బట్ట, పొట్ట అన్ని గూడ సర్కారోళ్ళు జూ త్తరు. 'నువు తోలితె జాలు, గంతె' అంటున్నారుండ్రి మా కున్న పెద్ద దిక్కు మీరే గదండ్రి బాంచన్....గందు కనే...." గొణిగాడేదో!

దొరగారు చూస్తున్న పేపర్ని పక్కనే ఉన్న 'టిపాయ్' మీద పెట్టారు. అది కాస్త గాలికి లేస్తూ క్రింద పడటానికి తయారుగా వుంది—ఎంకన్న ప్రాణం అచ్చం అలాగే వుంది.

"ఎంకటిగా!" దర్పం.

"బాంచెన్" అణకువ.

"పదో తరగతంటె ఎట్లనో గెంటిచ్చుండు గాని, పై చదువులంటే మాటలట్రా!? అయినా చదువుకున్నోళ్ళు ఏం జేస్తున్నర్రా! నౌఖర్లు దొరక్క రోడ్లపొంట తిరుగుతున్నరు! చదువు గిదువు బంద్ చేసి ఏన్నో లెక్కలు చూసే పనిలో పెట్టు. ఎరికైందా!?" అది సలహా కాదు—

ఆక్షరాలా ఆజ్ఞ.

మాట పూర్తి చేసి లోపలికెళ్ళాడు దొర.

నిరాశగా వెనక్కి తిరిగాడు ఎంకన్న "ఆని నసీబ్ (ఖర్మ) ఎట్ల ఉన్నదో!?" అనుకొంటూ.

* * *

"అయ్యా! రాములన్న కారటు (కార్డు) రాసిండె" పదిహేనేళ్ళ లక్ష్మి పరిగెత్తుతూ వచ్చింది చేతిలో ఉత్తరంతో, సంబరంగా.

అన్నదగ్గర నేర్చుకొన్న అక్షరపుముక్కలు పేర్చి, లక్ష్మి ఆ ఉత్తరాన్ని చదువుతుంటె ఏనుగెక్కినట్లు ఫీలయ్యాడు ఎంకన్న.

తాను బస్తీలో ఎలా గడుపుతున్నదీ, కాలేజి ఎలా ఉందీ, పంతుల్ల గురించీ, అన్నీ వివరంగా రాశాడు రాంబాబు (రాములు). (అతడి గుండెలో అనురాగ విపంచిక, తృప్తి భావ వీచిక.)

ఎంకన్న తృప్తిగా 'త్రాగాడు', ఆ రోజు.

* * *

"ఎంఖటిగా!"

అది దొరగారి 'పిలుపు'

"బాంచెన్ దొర!"

ఎంకన్నకి అలవాటైన 'పదం'.

(పరుగున వెళ్ళి దొరముందు నిల్చున్నాడు, చేతులు కట్టుకొని).

"ఊఁ! ఏందిరో!? మీ రాంవులుగాన్ని చదువుకు తోల్నవట?"

(దొరగారి కంఠంలో ఆపుకొంటున్న ఆవేశం, స్పష్టంగా) ఎంకన్నకి మాట పెగల్లేదు. తలొంచుకొని అన్నాడు, మెల్లిగా

"బాంఛన్."

"ఊఁ! నీ యిష్టం, నీ కొడుకూ, నీ యవ్వారం."

* * *

రాజు తల్చుకొంటె కొ ద వు ం డ దు, దెబ్బలకి!

దొర తల్చుకొంటె కొ ర వు ం డ దు, తప్పులకి!

చేయని నేరాలకి శిక్ష అనుభవించడం ఈ వ్యవస్థలో అత్యంత సర్వసాధారణ విషయం. అందులో న్యాయం అంటేనే 'తానైన' దొరగారి దృష్టిలో అతడికి నచ్చనిది ఏదైనా అది అన్యాయమే! శిక్షార్హమే!!

ఏ కాన్‌స్టిట్యూషన్ అడుగెట్టని ఆ దివాణంలో—

ఏ న్యాయశాస్త్రం తలకెక్కని ఆ భూస్వామ్యంలో

ఏ పీనల్‌కోడూ ప్రవేశించని ఆ గ్రామ రాజ్యంలో

కట్టలు తెంచుకొన్న ఆవేశం

హద్దులు పెంచుకొన్న దొరతనం

ఎంకన్నని కట్టెలేపి మరీ కొట్టింది.

ఫలితం!

అతడి పుర్రె పగిలింది. నెత్తురు చిమ్మింది.

కాని

అది 'ఎంకన్నలాంటి' వారికి తరతరాలుగా వాలవాటె

అందుకే అతడు ఎదురు మాట్లాడలేదు(డు).

దివాణంకి పోకుండా ఉండలేదు (డు).

* * *

అది ప్రొద్దుటివేళ. సూర్యుడింకా రాలేదు. కాని అతడి తొలి కిరణాల వర్చస్సు ఆ ఉదయానికి శోభ నిస్తోంది.

ఒక మూల పశువులపేడ తీస్తూ అంటోంది సుంకరిరాజి "అయినా ఈ ఎంకటిగానికి పొగరు గాకపోతె, దొరగారు అదనంగా సుత (సైతం) రాంవులుగాన్ని సదువుల పెడ్తాడు? దొరంటె గంత ఫికర్ (భయం) లేకుండ వొయిరాది?"


పోశన్న గేదెల్ని విడుస్తున్నవాడల్లా, అటు ఇటు చూసి "ఒసే రాజీ! అసలు సంగతి అది గాదె! ఇంగో మన చిన్నదొర ఏదో తరగతే మూడుసార్లు ఫేలయిండాయె. మరి ఆ రాములు గాడు పదోకిలాసు ఫస్టున కామ్యాప్ అయి పట్నంలో పెద్ద చదువుకోతే దొరకు నామర్దా కదా? గందుకే ఎంకుమావని దొరగారు....."

పోశన్న ప్రాణాలు ఒక్కసారి ఆకాశంలోకి వెళ్ళి మళ్ళొచ్చినంత పనైంది, ఎదురుగా వెదురుకర్ర పట్టుకు నిల్చున్న 'చినదొర'ను చూసి.

"లమ్డికొడుక! నువ్విక్కడ ఏం జేస్తున్నవ? బాత్కాని కొడ్తున్నావా?....చెప్పు








వేంద్ర గాడికొడుక!"

'చినదొర అచ్చంగా దొర కొడుకే' అనుకొంది దూరంగా నిల్చుని వణికిపోతున్న సుంకరిరాజి.

'వెదురుకర్ర' పైకీ క్రిందకు లేస్తోంది.

* * *

దొడ్డిలో ఎవరో ఎవర్నో కొడ్తున్న శబ్దం విని అటువైపు తొంగి చూసిన దొరగారు తన కొడుకు (చినదొర) చేతిలో దావు దెబ్బలు తింటోన్న 'పోశిగాన్ని' చూసి చూడనట్టే ముందుకు సాగిపోయాడు.

* * *

"లక్ష్మి"

ఎంకన్న కూతురు.

రాంబాబు చెల్లెలు.

పోశిగాని కాబోయే పెళ్ళాం.

అంతకు మించి 'అందరి దృష్టి'లో

'చక్కని చుక్క!

వెన్నెల ముక్క!!'

(అలాంటి అందం కొందరికే ఉంటుంది. అయితే ఉన్నవారికి అన్నీ అందమే. అందమూ అందమే. కాని ఈ పేదపిల్లకు ఆ అందం శాపమేనేమో?)

తండ్రికి జ్వరం.

బావకి దెబ్బల బాధ.

అయినా సరే, దివాణం పని తప్పకూడదు. అందుకే ఆ 'డ్యూటీ' లక్ష్మి చేయడానికి దివాణంలోకి రాక తప్పలేదు.

బితుకు బితుకుమంటున్న గుండెతో

దడ దడ లాడుతోన్న మనసుతో

సన సన్నగ వణుకుతున్న శరీరంతో

అటు ఇటు బెరుకు చూపులతో

దివాణంలోకి....

మెల్లగ మెల్ల మెల్లగా....

"ఎవతివే?" చినదొర గొంతు! లక్ష్మికి ఝల్లుమంది.

"నేను.......ఎంకన్న.......బిడ్డన్ దొర!"

భయంగా.

"ఊఁ! ఏం సంగతి, మీ అయ్య రాలేదా?" కరుగ్గా.

"మా అయ్యకు ప్రాణం మంచిగ లేదుండ్రి. గందుకె నన్ను తోలిండు, పని చేయటానికి...."

"అహఁ! అట్లనా? అదుగో ఆ దొడ్డిలో కెళ్ళు!" గబ గబ గబా నడిచింది లక్ష్మి అటువైపు.

"బంభత్! పోరి మా సక్కగుంది" చిన్నదొర కళ్ళలో కోరిక ఇంతై....ఇంతింతై....

అయి....అయి....

ఇటు ఇటూ చూశాడు

సంధ్య వాలిపోతున్న

....సూర్యుడు "అక్రమాన్ని" చూసి

ఆవేశం పట్టలేక

ఎర్రగా....

మండే అగ్నిలా

తర్వాత ?

(ఏం చేయలేక, అక్కడి ఘోరం చూడ లేక కొండల చాటుకి దాక్కున్నాడు. సూర్యుడు పిరికిగా పారిపోవటంతో చీకటి లోకాన్ని ఆదర బాదరగా ఆక్రమించుకొంది.)

* * *

"అందుకే, నీ లాంటి అహింసావాదులు తొలగిపోతేగాని ఈ లోకంలో మార్పు రాదు" మిత్రుని గుర్రుగా చూస్తూ, సత్యం.

రాంబాబు నవ్వాడు.

"నీ పిచ్చిగాని సత్యం! కేవలం భూస్వాముల్ని ఖతం చేసినంత మాత్రాన ఈ వ్యవస్థ మారుతుందా? అధికార, ధన మదంతో. వాళ్ళు అక్రమాలు చేస్తే, మనం కూడా అదే దారిన నడిచి, వాళ్ళని హతమారిస్తే వాళ్ళకీ మనకీ తేడా ఏమిటి? తుపాకితో కాదోయ్, వాళ్ళను సంస్కరించడంతో సమ సమాజం రావాలి. అప్పుడే జాతి పురోగమిస్తుంది."

"బాప్‌రే! సంస్కరణం, సమ సమాజం, శాంతి, జాతి, హుం! నీలాటి మితవాదులు ఉండబట్టే ఈ వ్యవస్థ ఇలా ఏడ్చింది ప్చ్! నువ్వింకా చాలా నేర్చుకోవాలోయ్ రాంబాబూ!"

అంతలోనే—"రాములూ" అనే పిలుపు!

రాంబాబు ఛటుక్కున లేచాడు, ఆత్రంగా. అలా పిల్చేవారు తన ఊరివాళ్ళై వుంటారు గనుక.

తలుపు దగ్గర దిగులుగా పోశిగాడు!

(పోశన్న. పాలేరు పోశన్న. తన బావ. కాబోయే లక్ష్మి భర్త.)

"నువ్వా పోశం బావా?" రాంబాబులో ఆశ్చర్యం.

"అవున్రా రాములూ! నేను దొర దగ్గరుండలేక దేశం పోతున్నా. దొర కాళ్ళకాడ కుక్క బతుకు బ్రతికేకంటే, అక్కడ అడుక్కతిన్నది నొక్కం."

పోశన్న గుండెలో నైరాశ్యం—కళ్ళలో కన్నీరు.

రాంబాబు పోశన్ననే విస్తుపోయి చూస్తున్నాడు.

"అప్టరాల్ పాలేరు పోశం బావకు, దొరకాన్నుంచి పారిపొయ్యే ధైర్యం ఎక్కన్నించి వచ్చింది? చదువుకొంటున్న తనే దొరంటే వణకిపోతాడే?"

"పోతాన్రా" దిగులుగా వెనక్కి తిరిగాడు పోశన్న.

"ఏడికి బోతావ్ బావా? అసలు ఇంటికాడ చెప్పే-ఈడికి వచ్చినవా? అయ్య ఏమన్నడు" రాంబాబులో ఆత్రం.

"చెప్పే వచ్చిన్రా! మీ అయ్య నిన్నోసారి అర్జంట్‌గ రమ్మనడు. అది చెప్పోదమనే వచ్చిన" ఆగకుండా గబ గబ వెళ్ళిపోయాడు పోశన్న.

రాంబాబు ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది.

* * *

దుమ్ము రేపుకొంటూ ఆగింది బస్సు.

గబ గబా దిగి....

అడ్డ దారిన....

తన పల్లె వైపు....

చక చకా, ఎంతో ఉత్సాహంగా, మరెంతో ఆత్రంగా....ఎడతెగని ఆలోచనలతో—

"ఏమైంది? పోశంబావ ఎందు కెళ్ళిపోయాడు? అసలు తన్ని అయ్య ఎందుకంత అర్జెంటుగా రమ్మన్నాడు?"

ప్రశ్నలు! ఆలోచనలు!!

ఎక్స్‌ప్రెస్‌లా ఆగకుండా!

ఎలాస్టిక్‌లా తెగకుండా!!

చీకటి ముసురుకుంది.

ఏడుగంటలకే నిద్రపోయింది పల్లె.


(ఏం చేస్తుంది. చలికాలం మహత్యం.)

గబ గబా ఇంటిదారి.

గుడిసెలో చీకటి

ఇంకా దీపం వెలిగించలేమిటబ్బా!?






ఇంత త్వరగా నిద్రపోయుంటారా!

గుడిసె తలుపులు తోసి లోపలి కెళ్ళాడు, చీకట్లో తడుముకుంటూ.

"లక్ష్మి" పిల్చాడు.

సమాధానం రాలేదు.

అగ్గిపెట్టె ఎక్కడ!? తెలిసిన జాగాలో, చీకట్లోనే వెదికాయి చేతులు.

అమ్మయ్య దొరికింది.

అగ్గిపుల్ల వెలిగింది

చువ్! చువ్!!

అగ్గిపుల్ల వెలుగుని లాంతరు అందుకొంది.

చీకటి విచ్చింది!

వెలుగు వచ్చింది!!

కళ్ళు వెలుగుకి అలవాటు పడ్డాయి!

చుట్టూ చూశాడు....

గుండె గుభిల్లుమని....

ఒళ్ళు జల్లుమని....

మెరుపులు మెరిసినట్టై....

పిడుగులు ఉరిమినట్టై....

ఉప్పెన ఉబికినట్టై

—"లక్ష్మీ!"

అది పిలుపు కాదు.

గుండెల్ని చీల్చుకొచ్చిన అరుపు.

పల్లెని నిద్ర లేపిన భీకర శంఖానాదం.

సందడి. కోలాహలం. అయోమయం. గంద్రగోళం.

అక్కడికి ఉరికి వచ్చిన పల్లె ఉలిక్కిపడింది, కన్పించిన ఘోరదృశ్యం చూసి.

....దూలానికి వ్రేలాడ్తూ

జీవితాన్ని వదిలేసి

లక్ష్మి!

....గుండె పగిలి

ఆగి....

ఎంకన్న!!

ఆ రెండు చావులకి అర్థం, పల్లెలో అందరికి తెల్సిన సత్యం!

* * *

చితి మంటలు

ప్రక్క ప్రక్కనే చిటపట మంటున్నాయి!

గుండె మంటలు

గుప్పు గుప్పున భగ భగమంటున్నాయి!!

జ్వాలలు రాంబాబు మొఖంపై పారాడుతున్నాయి. ఎండిన కన్నీటి దారలు ప్రజ్వరిల్లే మంటలకి అడ్డం పడుతున్నాయ్!

అర్ధరాత్రి!!!

రెండు చావుల్ని కళ్ళారా చూసిన ఊరు అంత త్వరగా నిద్రపోలేక—చలిమంటల ప్రక్కన గుసగుస లాడుతోంది.

రాంబాబు ఒంటరిగా కదిలాడు స్మశానం లోంచి. అతడి కళ్ళలో ఇప్పుడు 'ఏదో' నిశ్చయం కనిపిస్తోంది.

ముందుకు....

ముందు ముందుకు....

మును ముందుకు....

(దొరగారి దివాణంవైపు)

పగ పాములా బుసలు కొడుతోంది.

ఆవేశం ఆరని జ్వాలై రగులుకొంటోంది.

కసి కత్తిని చేతబట్టి ఉరికింది.

ఫలితం!?

ప్రతీకారం తీరింది.

(దొరగా రింట్లో ఆరోజు 'కొన్ని ప్రాణాలు' రాంబాబు కత్తికి ఆకాశానికి ఎగిరాయి)

అప్పుడు, రాంబాబు 'విచిత్రం'గా నవ్వాడు(ట!) కత్తికి ఎర్రగా అంటుకొన్న 'ఎర్రని' రక్తాన్ని చూసి!

ర ర ర

మన దేశంలో ఒకా నొక న్యాయ స్థానంలో....

వినిపిస్తోంది—"కాబట్టీ....రాంబాబు అనే ఈ ముద్దాయికి సాక్ష్యాధారాలు విచారించి, అతడ్ని హంతకుడిగా నిర్ణయించి....చట్టం ప్రకారం (?) ఉరిశిక్ష (ఇది హత్య కాదుట) విధించడమైనది....!"

ఇది జడ్జి 'న్యాయమూర్తి'గారి తీర్పు!

"అమ్మయ్య! ఊహించిన తీర్పు!" కొందరు పెద్దమనుషులు హాయిగా ఊపిరి పీల్చుకొన్నారు.

(కొందరు కుర్రాళ్ళు పాపం! ఏవో కేకలు వేసి, పోలీసుల్తో తన్నులు తిన్నట్టు తెలిసింది. పిచ్చోళ్ళు!)

టక్! టక్! టక్! టక్!

బూట్ల చప్పుడికి ఉలిక్కిపడి చూశాడు రాంబాబు.

తెల తెల్లవారుతోంది. జ్ఞాపకాలు వదిలిపెట్టి పోయాయి.

ప్రారంభమైంది, హడావిడి.

మరో గంటలో చట్టప్రకారం 'హత్య' చేస్తారు.

పదిమంది 'పెద్దల' సమక్షంలో 'ఉరి' తీసి, చంపుతారు.

నవ్వుకొన్నాడు రాంబాబు.

తతంగమంతా పూర్తయింది.

గద్దె....

వేదిక....

బలిపీఠం....

ఉరికంబం....

ముఖంపై నిండుగ నల్లగుడ్డ.

చీకటి.

కళ్ళు తెరిచినా—మూసినా

చీకటే!

కళ్ళముందు నల్లటి బట్ట, వెలుగు చూడనీ కుండా....

"దేవుణ్ని నమ్మడట. దైవ ప్రార్థనకు ఒప్పుకోలేదు...." ఎవరో ఎవర్తోనో అంటు న్నారు.

చీకటి! చీకటి!!

ఏమీ కన్పించడంలేదు.

బహుశః తల్లి గర్భం నుంచి వచ్చేప్పుడు కూడా ఇలాగే చీకటిగా ఉంటుందేమో? ఏమో!? హుఁ!! (పెదవిపై ఓ మందహాసం.)

మరణానికి ముందు జననం గురించి ఆలోచన!

చావు పుట్టుకలకు ఎంతటి వ్యత్యాసం!

చావు పుట్టుకలకు ఎంతటి సామీప్యం!!

(అధికారులు చేస్తున్న హంగామా చెవులకి సోకుతోంది.)

మెడలో 'ఉరిత్రాడు' బిగించారు. ఎవరో అధికారి ఏమో ఆర్డర్సు జారీ చేస్తున్నాడు. బహుశః రెడీ వన్ టూ త్రీ అంటున్నాడేమో? ఏమో కావచ్చు!!

ఉరిత్రాడు కంఠానికి కరుకుగా తగుల్తుంటే రాంబాబు అనుకొంటున్నాడు "మళ్ళీ జన్మంటూ ఉంటే.మళ్ళీ ఈ ఉరిత్రాడు తప్పదు" అని. □



సరికొత్త సైంటిఫిక్, రొమాంటిక్ సీరియస్ సీరియల్




## దేశం

ఆగస్టు ఆరవ తారీకు రాత్రి హాయిగా నిద్ర పోయింది అవినాష్ ఒక్కడే. హాయిగా నిశ్చింతగా నిద్రపోయేడు.

చాలు....

ఈ చంద్రుడి గొడవతో ప్రజల దృష్టి అటు మళ్ళుతుంది. ప్రళయం పేరిట భయంలో— రాజకీయాలపట్ల అసక్తి తగ్గుతుంది. ప్రళయం వస్తుందా రాదా అన్నది వేరే సంగతి. వచ్చినా రాకపోయినా అంతపెద్ద ప్రమాదమేమీ లేదు. రాజకీయాల్లో ప్రతిక్షణమూ ప్రళయమే. ఎవడు ఏ క్షణం పార్టీ మార్చేస్తాడో తెలియదు. దక్షిణాదివాడు ప్రధాని కావాలని ఒకవైపు గొడవ. పార్టీ రెండుగా చీలిపోయే ప్రమాదం ఒకవైపు. అన్నిటికన్నా పెద్ద ప్రమాదం—

తమ పార్టీ పదవిలోకి వచ్చేక దేశపు కరెన్సీ విలువ ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రోజు రోజుకీ పడిపోతూంది; ఏదో అద్భుతం జరిగితే తప్ప దేశాన్ని ఎవరూ రక్షించలేరు. ఇప్పటి వరకూ దేశం నాశనమైపోతుందని బాధ. ఇప్పుడు మనతోపాటూ అందరూ పోతున్నారన్న తృప్తి.

ఇంతలో ఫోను.

సెక్రటరీ. ప్రధాని వస్తున్నారని వార్త.

మరుసటి నిముషంలో జగదీష్ హడావుడిగా ప్రవేశించేడు. "రండి మనం అర్జంటుగా ప్రెసిడెంట్ దగ్గరికి వెళ్ళాలి."

"ఎందుకు?"

"దార్లో మాట్లాడుకుందాం."

ఆతడి మొహం చూసి ఏదో ఉపద్రవం జరిగి వుంటుందనుకొన్నాడు అవినాష్.

ఇద్దరూ కార్లో కూర్చొన్నాక కారు కదిలింది. లోపల ట్రాన్సిస్టర్ వినిపిస్తూంది.

—ఒక ముఖ్యప్రకటన. ఆగస్టు పదిహేడున జరగబోయే ప్రమాదాన్ని వూహించుకొని ఇప్పట్నుంచే భీతి చెందవద్దని ప్రజల్ని ప్రధాన మంత్రి కోరేరు. తమతమ పనని విడిచిపెట్టి, ఈ ఆలోచనతో మరింత కల్లోలాన్ని సృష్టించవద్దని హెచ్చరిస్తున్నారు బి. బీ. సీ.